క్లుప్తంగా...

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు


సాయినగర్‌లో విద్యుత్ సెక్షన్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ జితేంద్రనాథ్

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ ప్రజలకు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా కృషి చేస్తున్నామని స్థానిక కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ అన్నారు. మంగళవారం ప్రజల సౌకర్యార్థం డివిజన్ పరిధిలోని శ్రీసాయినగర్‌లో కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ సెక్షన్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎలక్ట్రికల్ డీఈ సుచింద్రనాథ్, ఏడీఈ మారాచారి, రామానుజచారి, ప్రభాకర్, రాజేశ్వర్‌చారి, మల్లేష్, ఏఈ నరేష్ రెడ్డి, బాలమురళి, అశోక్ తదితరులు ఉన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి


భూదేవినగర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సబితకిషోర్

అల్వాల్: వెంకటాపురం డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని స్థానిక కార్పొరేటర్ సబితకిషోర్ అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని భూదేవినగర్‌లో రూ.8.4 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని కాలనీల్లో ప్రజలకు అవసరమయ్యే రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్, ఇతర మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. ఏఈ అరుణ్, వర్క్స్ ఇన్‌స్పెక్టర్ నవీన్, కాలనీవాసులు లక్ష్మణ్‌రావు, సునీల్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, బీమ్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



కాప్రా: కమలానగర్‌లోని శ్రీసహస్ర లింగేశ్వర స్వామి ఆలయం బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం శివపార్వతుల కల్యాణం, హోమం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఏఎస్‌రావునగర్ మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావనీమణిపాల్‌రెడ్డి, సిరిసిల్ల మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి హాజరై పూజలు నిర్వహించారు. మల్క రమాదేవి, ఏనుగు సీతారాంరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రాజు, వెంకటరాజు, నర్సింహ, దేవాలయ మాజీ చైర్మన్ జ్ఞానేశ్వర్, కమిటీ మెంబర్లు, భక్తులు పాల్గొన్నారు.

ఆట పరికరాల పంపిణీ



అల్వాల్: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం అల్వాల్‌లోని పార్టీ కార్యాలయంలో పలువురు చిన్నారులు ఆట పరికరాలను ఆమె పంపిణీ చేశారు. కార్యక్రమంలో కుట్టి, వినీత్, తనిష్, శాండిల్, కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర కల్యాణోత్సవం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: చిక్కడపల్లిలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవ, బిందె తీర్థం, పవనం, బలిహరణ, బాల భోగం, మంత్రపుష్పం, వేదపారాయణం తదితర కార్యక్రమాలను చేపట్టారు.

పరీక్షల్లో ఫెయిల్ అయ్యానని..


రేవంత్‌కుమార్ (ఫైల్)

అల్వాల్: పరీక్షల్లో ఫెయిల్ అయ్యాననే మనస్థాపంతో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. అనంతనగర్ కాలనీ వినాయక నగర్ బ్లాక్-1లో నివసించే రేవంత్‌కుమార్ సికింద్రాబాద్‌లోని సీఎమ్‌ఎస్ కాలేజీలో ఇంటర్ చదువుతున్నాడు. పరీక్షల్లో ఫెయిల్ అయినందున మనస్థాపం చెందాడు. ఇంటో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జలమా..గరళమా..?

- ప్యూరిఫైర్ వాటర్ మాటున గరళం
- నిబంధనలు పాటించకుండానే నీటి వ్యాపారం
- ఐఎస్‌ఐ మార్కు, లైసెన్సు లేకుండానే ప్లాంట్లు
- పట్టించుకోని అధికారులు.. రోగాల బారిన ప్రజలు
- ఇప్పటికైనా స్పందించాలంటున్న ప్రజలు



సాక్షి, మేడ్చల్ జిల్లా: వేసవి నేపథ్యంలో తాగునీటికి ఇబ్బందులు ఏర్పడుతుండగా ఇదే అదనుగా ప్యూరిఫై వాటర్ పేరుతో కొందరు నీటి వ్యాపారం చేస్తున్నారు. విచ్చలవిడిగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ప్లాంట్లు ఏర్పాటైనా ఒక్కచోటా కనీస నిబంధనలు పాటించడం లేదు. జిల్లాలో 600లకు పైగా ప్యూరిఫై(శుద్ధి) ప్లాంట్లు ఉండగా, ఇందులో అన్ని అనుమతులతో కొనసాగుతున్న ప్లాంట్లు దాదాపు 200 వరకు ఉన్నట్లు భూగర్భ జలవనరుల శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలోనే నీటిని నిబంధనలకు అనుగుణంగా ప్యూరిఫై(శుద్ధి) చేయకుండానే విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పెరిగిన నీటి వ్యాపారం

జిల్లాల విభజన జరగకముందు వేళ్ల మీద లెక్క పెట్టే సంఖ్యలో ఉండే ప్యూరిఫై ప్లాంట్లు నేడు పురపాలక సంఘాలతో సహా గ్రామ పంచాయతీలు, జీహెచ్‌ఎంసీ పరిధిలోని డివిజన్లలోని ప్రధాన కూడళ్లలో ప్రతిచోటా వెలిశాయి. వేసవికాలం, పెళ్లిళ్లు ఇతర శుభ కార్యాలయాలు, హోటళ్లు, బార్లు, వైన్ షాపులు, ఇతర వ్యాపార సముదాయాలను కలుపుకుంటే వేల సంఖ్యలో క్యాన్ల విక్రయాలు జరుగుతున్నాయి. ప్లాంటు దగ్గరికే వెళ్లి తీసుకుంటే ఒక్కో క్యానుకు రూ.10 తీసుకుంటున్నారు.

నియంత్రణ లేకపోవడంతో..

మిషన్ భగీరథ పథకం రానప్పుడు ఎక్కడైతే తాగడానికి పనికిరాని నీరుందని సమాచారం వస్తే అక్కడ నీటి పరీక్ష జరిపి ఆర్వో ప్లాంట్లకు అనుమతి ఇచ్చేవారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితితోపాటు నియంత్రణ లేకపోవటంతో.. ఇదే అదనుగా భావిస్తున్న వ్యాపారులు ఇష్టం వచ్చిన రీతిలో ప్లాంట్లను విస్తరిస్తున్నారు. ఇప్పటికైనా నిబంధనలకు విరుద్ధంగా వెలుస్తున్న ప్యూరిఫై వాటర్ ప్లాంట్ల నియంత్రణపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

నిబంధనలు ఇవీ..

వాటర్ ప్లాంటు ఏర్పాటుకు బీఎస్‌ఐ అనుమతి ఉండాలి. ప్రతి సంవత్సరం రెన్యువల్ చేసుకోవాలి. ప్లాంటులో విశాలమైన హాలు ఉండాలి. వెలుతురు, గాలి ఉండాలి. టైల్స్, గ్రానైట్ గచ్చు ఉండాలి. స్టీల్, హెచ్‌డీపీ పైపు లైన్లు ఏర్పాటు చేసుకోవాలి. ఐఎస్‌ఐ మార్కు కలిగిన ఫిల్టర్ యంత్రాలు వాడాలి. నీటిట్యాంకులు, ఇతర సామగ్రి, నాణ్యమైనవి వాడాలి. పురపాలక సంఘం లేదా గ్రామ పంచాయతీ నుంచి ట్రేడ్ లైసెన్సు పొందాల్సి ఉంటుంది.

రా చెరువు తూము లీకేజీని అరికట్టాలని మంత్రికి వినతి


వినతి పత్రాన్ని పరిశీలిస్తున్న మంత్రి మల్లారెడ్డి

బోడుప్పల్: రా చెరువు తూము లీకేజీని అరికట్టాలని కోరుతూ వాసవినగర్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం స్థానిక కార్పొరేటర్ రాసాల వెంకటేశ్ యాదవ్ ఆధ్వర్యంలో మంత్రి చామకూర మల్లారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాలనీ అధ్యక్షుడు ఎండీ మహబూబ్ అలీ మాట్లాడుతూ కొంత కాలంగా రా చెరువు తూము నుంచి కెమికల్, కలుషిత నీరు లీకేజీ అయ్యి దిగువన ఉన్న కాలనీలోకి వస్తోందన్నారు. మంత్రి మల్లారెడ్డి, స్థానిక కార్పొరేటర్ వెంకటేశ్‌యాదవ్ చొరవ తీసుకుని చెరువు లీకేజీ నీరు రాకుండా చూడాలని కోరారు. సమస్యను ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి రెండు రోజుల్లో పరిష్కరిస్తామని మంత్రి మల్లారెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీవాసులు టి.రామకృష్ణ, నిఖిల్ మూర్తి, వినోద్‌కుమార్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లోప్రెషర్ సమస్యకు పరిష్కారం


రెడ్డికాలనీలో సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్ రెడ్డికాలనీలో నెలకొన్న తాగునీటి లో ప్రెషర్ సమస్యను మంగళవారం కార్పొరేటర్ బొంతు శ్రీదేవి పరిశీలించారు. వాటర్ వర్క్స్ అధికారులతో మాట్లాడి సమస్యకు గల కారణం తెలుసుకున్నారు. వాల్వ్ ఏర్పాటు చేసి లో ప్రెషర్ సమస్యకు సత్వర పరిష్కారం చూపాలని ఏఈ రోహిత్‌ను ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో రంగారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, తిరుపతి రెడ్డి, సురేందర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఐలయ్య, భూపాల్‌రెడ్డితో పాటు బీఆర్‌ఎస్ నాయకులు నాగిళ్ల బాల్‌రెడ్డి, శ్రీకాంత్ యాదవ్ పాల్గొన్నారు.

పనులను త్వరగా పూర్తి చేయండి


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సునీత

మౌలాలి: మౌలాలి డివిజన్ ఓల్డ్ సఫిల్‌గూడలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం కార్పొరేటర్ గున్నాల సునీతశేఖర్‌యాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గున్నాల చంద్రశేఖర్‌యాదవ్, శివ, శ్రీను, వెంకటేష్, జహంగీర్, పృథ్వి, టిల్లు, విజయ్, సందీప్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి


కంటి వెలుగు కేంద్రాన్ని సందర్శిస్తున్న కార్పొరేటర్ శ్రీవిద్యగౌడ్

బోడుప్పల్: కంటి వెలుగును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని 11వ డివిజన్ కార్పొరేటర్ కొత్త శ్రీవిద్య చక్రపాణిగౌడ్ అన్నారు. హేమానగర్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆమె మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బుధవారం నుంచి ఈ నెల 15వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటలకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కంటి పరీక్షలు చేసి, మందులు, కళ్లద్దాలు, అవసరమైన వారికి ప్రభుత్వ ఆస్పత్రిలో కంటి ఆపరేషన్ కూడా ఉచితంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు కొత్త చక్రపాణిగౌడ్, గడుసు జగదీశ్వర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, సిరిముళ్ల శ్రీనివాస్, మేడిశెట్టి వెంకట్‌గుప్తా, రఘు, వెంకటస్వామి, కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం బీజేపీతోనే సాధ్యం

గౌతంనగర్: ప్రజా సంక్షేమం బీజేపీతోనే సాధ్యమని పార్టీ రాష్ట్ర ఓబీసీ మోర్చా ప్రచార కార్యదర్శి జిల్లెల రవియాదవ్ అన్నారు. మంగళవారం గౌతంనగర్ డివిజన్ పరిధిలోని బూత్ నంబర్ 85, 8, 87 తదితర ప్రాంతాల్లో శక్తికేంద్రం ఇన్‌చార్జి బండారి రవి ఆధ్వర్యంలో దీవార్‌పే లిఖ్నా (గోడపై రాయడం) కార్యక్రమం నిర్వహించారు. జిల్లెల రవి యాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వాసంశెట్టి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం రావాలని అన్ని వర్గాల ప్రజలు కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రామోజీ, సంతోష్‌కుమార్, లక్ష్మణ్, జ్యోతిబాయ్, లక్ష్మణ్, జెనిగ వెంకట్ యాదవ్, రాములు, మల్లారెడ్డి పాల్గొన్నారు.

న్యాయవాదుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి


సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ తదితరులు

అల్వాల్: రాష్ట్రంలో అన్ని రంగాలు అభివృద్ధి చెందుతున్నాయని మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ అన్నారు. నేరేడ్‌మెట్‌లోని మల్కాజిగిరి కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మల్కాజిగిరి కోర్టు నూతన భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో పాటు న్యాయవాదుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపుతోందన్నారు. రాష్ట్రం ఏర్పాటు అనంతరం రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తోందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు గొల్లూరి అంజయ్య, ప్రభుత్వ న్యాయవాదులు సందీప్‌గౌడ్, మంత్రి రవీందర్, సుంకరి శ్రీనివాస్‌రెడ్డి, తోట వెంకట్ ప్రసాద్, పెంచాల సురేందర్‌రావు, మల్కాజిగిరి బార్ అసోషియేషన్ అధ్యక్షులు రాంచంద్రారెడ్డి, మాజీ ప్రెసిడెంట్స్ కారంగుల యాదగిరిరావు, పుట్టపాక సుధీర్‌కుమార్, పబ్బ రమేష్, రవికాంత్‌గౌడ్, న్యాయవాదులు మేకల శ్రీనివాస్, మహ్మద్ ఖలీల్, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం


విజేతలకు బహుమతులను అందజేసిన ఐలా చైర్మన్ రోషిరెడ్డి తదితరులు

కుషాయిగూడ: క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని ఐలా చైర్మన్ రోషిరెడ్డి అన్నారు. చర్లపల్లి పారిశ్రామికవాడలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మే డే వారోత్సవాలు మంగళవారం ముగిశాయి. క్రీడాపోటీల్లో గెలుపొందిన వారికి ఆయన బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం పనిఒత్తిడితో సతమతమయ్యే కార్మికులకు క్రీడాపోటీలు ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి పూర్తి సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో చర్లపల్లి ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు బీవీ సత్యనారాయణ, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్, జి.శ్రీనివాసులు, కొండల్‌రెడ్డి, రసూల్, వెంకటేష్, మణికంఠ, బాలరాజ్, సంతోష్, సోమాచారి, నరసింహులు, సుభాష్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

లో వోల్టేజీ సమస్యకు పరిష్కారం


అన్నపూర్ణ కాలనీలో లో వోల్టేజీ సమస్యను వివరిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత

ఉప్పల్: ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు చిలుకనగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఉప్పల్ అన్నపూర్ణ కాలనీల్లో లో వోల్టేజీ సమస్యను స్థానికుల ఫిర్యాదుతో తెలుసుకున్న కార్పొరేటర్ ట్రాన్స్‌కో ఏఈ సంతోష్ కుమార్‌తో కలిసి సమస్యను పరిష్కరించినట్లు కార్పొరేటర్ తెలిపారు. స్థానికులు కార్పొరేటర్‌కు ట్రాన్స్‌కో అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, కొండల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బస్తీ దవాఖానాకు శంకుస్థాపన


బస్తీ దవాఖానాకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ సామల బుచ్చిరెడ్డి

బోడుప్పల్: అంబేడ్కర్‌నగర్‌లో నూతనంగా నిర్మించనున్న బస్తీ దవాఖానాకు మంగళవారం బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి కొబ్బరి కాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆరోగ్యానికి పెద్దపీట వేస్తోందన్నారు. ప్రతి ఒక్కరికీ వైద్య సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. త్వరతిగతిన పూర్తిచేసి పేద, మధ్య తరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామన్నారు. అనంతరం రా చెరువును సందర్శించి సుందరీకరణ, సంరక్షణ గురించి అధికారులకు సూచించారు. కార్యక్రమంలో 23వ డివిజన్ కార్పొరేటర్ రాసాల వెంకటేశ్‌యాదవ్, 12వ డివిజన్ ఇన్‌చార్జి చంటి శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

రామకృష్ణారావు సేవలు మరువలేనివి


రామకృష్ణారావును అభినందిస్తున్న మేయర్ జక్క వెంకట్‌రెడ్డి, సీఐ గోవర్ధనగిరి

మేడిపల్లి: పీర్జాదిగూడ కార్పొరేషన్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ రామకృష్ణారావు బదిలీ అయిన నేపథ్యంలో మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ జక్క వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో పీర్జాదిగూడ కార్పొరేషన్‌కు పురస్కారాలు రావడంలో రామకృష్ణారావు సహకారం ఎంతో ఉందన్నారు. పీర్జాదిగూడ అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు కౌన్సిల్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు స్వాగతించేవారన్నారు. పీర్జాదిగూడ కార్పొరేషన్‌కు ఆయన అత్యుత్తమ సేవలు అందించారని అన్నారు. కార్యక్రమంలో మేడిపల్లి సీఐ గోవర్ధనగిరి, డీఈ శ్రీనివాస్, టీపీవో శ్రీధర్‌రెడ్డి, కార్పొరేటర్లు, ఎస్‌ఐలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన కమిషనర్‌గా వంశీకృష్ణ

పీర్జాదిగూడ కార్పొరేషన్‌గా కమిషనర్‌గా వంశీకృష్ణ బాధ్యతలు చేపట్టారు. మేయర్ జక్క వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్లు ఆయనకు స్వాగతం పలికారు.

కొత్త చెరువుల పునరుద్ధరణ పనులు వేగవంతం


అల్వాల్‌లోని కొత్త చెరువు వద్ద వివిధ శాఖల అధికారులు

అల్వాల్: చెరువుల పునరుద్ధరణ కార్యాచరణలో భాగంగా విభిన్న కార్యక్రమాలను రూపొందించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఇటీవల అల్వాల్ సర్కిల్‌లో పర్యటించిన రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి అర్వింద్ కుమార్, మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆయా ప్రభుత్వ శాఖ అధికారులతో కలిసి అల్వాల్‌లో ఉన్న చిన్నరాయుడి చెరువుతో పాటు కొత్త చెరువును పరిశీలించారు. ఈ నేపథ్యంలో ముందుగా వరద నీటి కాల్వల పునర్నిర్మాణం, చెరువుల పూడికతీతతో పాటు సీవరేజి డైవర్షన్ పనులను చేపట్టాలని సంబంధిత అధికారులను ప్రత్యేక కార్యదర్శి అర్వింద్‌కుమార్ ఆదేశించారు. ఈ తరుణంలో ఎదురయ్యే ఆక్షేపణలను సైతం పరిశీలించారు. ఇరిగేషన్, రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులకు సూచనలు ఇచ్చారు.

కొత్త చెరువు వద్ద పనుల పరిశీలన..

అల్వాల్ కొత్త చెరువు వద్ద సీవరేజి డైవర్షన్ పనులకు సంబంధించి నెలకొన్న అడ్డంకులను జీహెచ్ఎంసీ అల్వాల్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారి ఏసీపీ విజయశ్రీ నేతృత్వంలో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు మంగళవారం పరిశీలించారు. ఇరిగేషన్, రెవెన్యూ, సర్కిల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జల్సాల కోసం చోరీల బాట

కుషాయిగూడ: జల్సాల కోసం దొంగతనం బాట పట్టారు ఇద్దరు మైనర్ బాలురు. రాత్రి వేళల్లో ఇళ్ల ముందు పార్కు చేసిన ద్విచక్ర వాహనాలను దొంగిలించి జల్సాలు చేయడం హాబీగా మార్చుకున్న వారు పోలీసులకు పట్టుబడ్డ ఘటన మంగళవారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. కుషాయిగూడ ప్రాంతానికి చెందిన ఇద్దరు మైనర్ బాలురు మద్యం, సిగరెట్టు తాగడం వంటి చెడు వ్యసనాలకు బానిసయ్యారు. ఈ క్రమంలో వారిద్దరూ స్నేహితులుగా మారి చోరీల బాట పట్టారు. రాత్రి సమయంలో ఇళ్ల ముందు పార్కు చేసిన ద్విచక్రవాహనాలను దొంగిలించడం మొదలుపెట్టారు. ఈ క్రమంలో మంగళవారం చక్రిపురం చౌరస్తా వద్ద వాహనాలు తనిఖీలు చేస్తున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు మైనర్లకు కౌన్సెలింగ్ ఇచ్చి జువైనల్ హోంకు తరలించారు.

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల బృందం

హబ్సిగూడ: రాష్ట్రంలో విడుదలైన ఇంటర్ ఫలితాల్లో ఎస్‌ఆర్ శ్రీగాయత్రి విద్యాసంస్థల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు విద్యాసంస్థల డైరెక్టర్ ఏ.సంతోష్‌రెడ్డి తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో శ్రీకర్, లావణ్య, నిహారిక, శ్రీవిద్య 467, బైపీసీలో శృతి, దీక్షిత్ 436, ఎంఈసీలో రాగిణి 492, సీఈసీలో సైదా ముస్రా 489 మార్కులు సాధించారు. అదేవిధంగా సీనియర్ ఇంటర్ ఎంపీసీలో మహితదేవి, దీపికలు 992, బైపీసీలో విజయ్‌రాయ్ 992, ఎంఈసీలో ప్రేరణ 986 మార్కులు సాధించారు. ప్రతిభ సాధించిన విద్యార్థులను కళాశాల అధ్యాపక బృందం అభినందించారు. కార్యక్రమంలో డీజీఎం భగవాన్‌రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ శ్రీనివాస్, జోనల్ ఇన్‌చార్జి కృష్ణగౌడ్, ప్రిన్సిపల్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో సత్తాచాటిన షిప్స్ విద్యార్థులు

రామంతాపూర్: గోకుల్‌నగర్‌లోని షిప్స్ జూనియర్ కాలేజ్‌లో మంగళవారం ప్రకటించిన ఇంటర్మీడియట్ మొదటి, రెండవ సంవత్సరం ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించి సత్తా చాటారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీలో సింధుజ 470 మార్కులకుగాను 464 సాధించారు. అదేవిధంగా ఇంటర్ సీనియర్ ఫలితాల్లో ఎంపీసీలో ఎం.సతీష్ కుమార్ 1000 మార్కులకు గాను 988, ఎస్.అఖిల 986, ఎంఈసీలో శివసాయిసుదన్ 971 మార్కులు సాధించి సత్తా చాటారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను కళాశాల చైర్మన్ శ్రీనివాస్‌రావు, ప్రిన్సిపాల్ రాజారెడ్డి అభినందించారు.


సింధూజ (464)


కె.హర్షశ్రీ(645)


ఎం.సంధ్యా(643)


మునీందర్ (643)

ఎస్‌ఆర్ విద్యార్థుల హవా

మేడిపల్లి: ఇంటర్ ఫలితాల్లో పీర్జాదిగూడ కార్పొరేషన్‌లోని బోడుప్పల్ ఎస్‌ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. సీనియర్ విభాగంలో కావ్య 991, శ్వేత 988, సూర్య కిరణ్‌రెడ్డి 988 మార్కులు సాధించగా, జూనియర్ విభాగంలో ఉమేందర్ 467, ఠాకూర్ 467, రజిత 466, శృతి 465, అఖిల 465, దీక్షిత 466, సహిమ 433 మార్కులు సాధించారు. విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించారు. కళాశాల చైర్మన్ వరదరెడ్డి, డైరెక్టర్లు సంతోష్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, జోనల్ ఇన్‌చార్జీ వెంకట్‌రెడ్డి, ప్రిన్సిపల్ మల్లారెడ్డి, లక్ష్మణ్, నరేష్, అనురాధ, అధ్యాపకులు పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న ఎస్‌ఆర్ కాలేజీ యాజమాన్యం

బధిర విద్యార్థుల హవా

అల్వాల్: రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం వెలువడిన ఇంటర్ ఫలితాల్లో బధిర విద్యార్థులు సత్తాచాటారు. హెలెన్ కెల్లర్స్ జే.పి.ఎం కళాశాల నుంచి బధిర విద్యార్థులు ఇంటర్ రెండో సంవత్సరంలో 94 శాతం, మొదటి సంవత్సరంలో 86 శాతం ఉత్తీర్ణత సాధించారని కళాశాల ఫౌండర్, చైర్మన్ పఠాన్ ఉమర్‌ఖాన్ తెలిపారు. మంగళవారం నేరేడ్‌మెట్‌లోని కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉమర్‌ఖాన్ మాట్లాడుతూ తమ కళాశాలలో ఇంటర్ ఎంఈసి, సీఈసి తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో చదివిన చెవిటి, మూగ విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ రెండో సంవత్సరంలో 56కి 53 మంది, మొదటి సంవత్సరంలో 99కి 93 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. కె.హర్షశ్రీ 800 మార్కులకుగాను 645 మార్కులు సాధించి మొదటి ర్యాంకును, ఎం.సంధ్యా 643 మార్కులతో రెండో ర్యాంక్, తెలుగు మీడియం నుంచి ఎం.మునీందర్ మూడో ర్యాంక్(626) సాధించారు.